అర్హులందరికీ గృహజ్యోతి వర్తింప చేయాలి



డీఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విద్యుత్ డీఈకి
కాంగ్రెస్ నాయకుల వినతి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గంలో అర్హులందరికీ గృహజ్యోతి వర్తింప చేయాలంటూ పట్టణ కాంగ్రెస్ నాయకులు విద్యుత్ శాఖ డీఈని కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నియోజకవర్గం పరిధిలో 32 వేల గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు నెలకు రూ. కోటి 24 లక్షలు మాఫీ అవుతోందన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొంతమంది అర్హులు మిగిలిపోయారని,వారిని కూడా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ కార్యదర్శి మతిన్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అతిక్, పట్టణ కార్యదర్శి అబ్దుల్లా, శ్రీనివాస్ ముదిరాజ్, హనుమంతు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

సనత్‌నగర్: సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి ఆలయంలో శుక్రవారం లలితా పారాయణ మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మల్లెపూలు, కుంకుమార్చన, మామిడి పండ్లతో అభిషేక మహోత్సవం నిర్వహించారు. రాంగోపాల్‌పేట కార్పొరేటర్ చీర సుచిత్రాశ్రీకాంత్, అశ్విని, నిర్వాహకురాలు రాజశ్రీ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

21న మున్సిపల్ భవనం ప్రారంభోత్సవం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లో నూతనంగా నిర్మించిన నూతన మున్సిపల్ భవనంను ఈనెల 21వ తేదీ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలితసోమిరెడ్డి తెలిపారు. శుక్రవారం నూతన మున్సిపల్ భవన ప్రాంగణంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ పాలకవర్గంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్‌లు రవీందర్‌రెడ్డి, బాలాజీ, మయూరి రాజుగౌడ్, సరిత పాల్గొన్నారు.

మొదటిరోజే పుస్తకాలు, యూనిఫాంలు

ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైన రోజే అందజేత



శేరిలింగంపల్లి మండల రీసోర్స్ సెంటర్‌లో ఉంచిన పాఠ్య, నోట్ పుస్తకాలు

- 94 వేల పుస్తకాలకు గానూ 3 విడతల్లో 79 వేల పుస్తకాలు వచ్చాయ్
- ఏటా ఇలాగే ఇవ్వాలంటున్న తల్లిదండ్రులు

శేరిలింగంపల్లి: కొత్త విద్యాసంవత్సరం ఆరంభమైంది. ప్రారంభం రోజు నుంచే పుస్తకాలు, యూనిఫామ్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఆరంభించింది. దీంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్‌లు ఇచ్చారు. గతంలో స్కూళ్లు ప్రారంభమైన కొద్దిరోజుల వరకు పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ కార్యక్రమాలు సాగేవి. కానీ ప్రస్తుతం మొదటి రోజే విద్యార్థులకు అన్నీ అందించడం విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఏటా ఇలాగే చర్యలు తీసుకోవాలని వారు పేర్కొంటున్నారు. శేరిలింగంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల వివరాలిలా..

అవసరమైన పుస్తకాలు

- మండల పరిధిలో విద్యార్థులకు 94,000 పాఠ్య పుస్తకాలు అవసరం
- మూడు విడతల్లో వచ్చిన పుస్తకాలు 79,000
- ఇక 6వ తరతగతి నుంచి 10వ తరగతి వరకు నోట్ పుస్తకాలు 71,400 కావాలి
- 1- 5 వ తరగతి వరకు వర్క్ బుక్స్ కూడ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

◆ మొత్తం పాఠశాలల సంఖ్య	59
◆ ప్రాథమిక పాఠశాలలు	43
◆ ప్రాథమికోన్నత పాఠశాలలు	3
◆ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు	13
◆ 59 పాఠశాలల్లో 16,800 మంది విద్యార్థులు	

- అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా యూనిఫాంలు సిద్ధం చేశారు. ఒక్కో జత ఇవ్వనున్నారు.

అన్ని సౌకర్యాలున్నాయి



శేరిలింగంపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ స్కూల్స్‌లో ఈ నెల 6వ తేదీ నుంచి బడిబాటలో భాగంగా అన్ని ఏర్పాట్లు చేశాం. ముఖ్యంగా నీటి వసతి, బాత్ రూమ్స్, కరెంట్, చిన్న మరమ్మతులను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేస్తున్నాం. ఇంటింటికి వెళ్లి బడి ఈడు పిల్లలను బడికి పంపాలని తల్లిదండ్రులను కలిసి వారిని చైతన్య పరిచాం. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాంలు ఇస్తున్నాం.
– వెంకటయ్య, ఎంఈఓ, శేరిలింగంపల్లి

ఇటుక బట్టీల్లో అధికారుల తనిఖీలు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామ పరిధిలోని పలు ఇటుక బట్టీల్లో శుక్రవారం రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇటుక బట్టీల్లో బాల కార్మికులు పనులు చేస్తున్నారని, అక్రమంగా మట్టిని సేకరిస్తున్నారనే ఫిర్యాదులు రావటంతో అధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు. తహశీల్దార్ బిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ కార్మికులు, యాజమాన్యాలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆర్ఐ మాట్లాడుతూ ఇటుక బట్టీల్లో బాల కార్మికులు లేరన్నారు. అనుమతులు లేకుండా మట్టిని సేకరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రక్తదానం ప్రాణదానమే..



వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే వేడుకల్లో పాల్గొన్న వైద్యులు

కూకట్‌పల్లి: రామ్‌దేవ్‌రావ్ హాస్పటల్, వికెఆర్ బ్లడ్ సెంటర్ సంయుక్తంగా శుక్రవారం వరల్డ్ బ్లడ్ డోనర్ డేని నిర్వహించారు. కార్ల్ లాండ్‌స్టెయినర్ పుట్టిన రోజు సందర్భంగా రక్తదానం, రక్తదానం యొక్క ఆవశ్యకతను పేషంట్లకు, ప్రజలకు అవగాహన కల్పించారు. 300 సార్లు రక్తదానం చేసిన సంపత్‌ని, రక్తదానం చేసిన 10 మందిని రామ్‌దేవ్‌రావ్ హాస్పటల్ వారు సన్మానించారు. ఈ సందర్భంగా హాస్పటల్ ఎండి డా. కె. కమలాకర్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానమేరు. దీనివల్ల మరోకరికి కొత్త జీవితం ప్రసాదించినట్లు భావించాలన్నారు. వికెఆర్ బ్లడ్ సెంటర్ డైరెక్టర్ డా. సుమన మాట్లాడుతూ రక్తదానం చేసి మరోకరిని అనారోగ్యం నుంచి కావాడాలన్నారు. ఇందులో భాగంగా 300 సార్లు రక్తదానం చేసిన డా. సంపత్, 249 సార్లు రక్తదానం చేసిన శ్రీనివాస్ గొగరాజు, 99 సార్లు రక్తదానం చేసిన మహేందర్‌రెడ్డిలను నిర్వాహకులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, నర్సులు, రక్తదానం చేసిన దాతలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజయ్య

పటాన్‌చెరు టౌన్: విద్యాహక్కు చట్టం ప్రకారం 25% సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉచితంగా ఇవ్వాలని, రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజయ్య అన్నారు.శుక్రవారం సీపీఐ (ఎం) పటాన్‌చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలలో అధిక ఫీజులను, డొనేషన్‌లను అరికట్టాలని, అధిక ఫీజులు వసూలు చేసే వారిపైన క్రిమినల్ కేసు నమోదు చేయాలని, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని, పేరెంట్స్ కమిటీలను నియమించాలని, సుప్రీంకోర్టు గైడ్‌లెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం ఏరియా కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, సీపీఎం, సీఐటియూ నాయకులు శాంతకుమార్, శ్రీధర్, లకాన్, చక్రధర్ సింగ్, ఎంజీవిఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఫొటోగ్రాఫర్‌ల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం పట్టణంలోని బాలాజీ గార్డెన్స్‌లో ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్‌ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఫొటోగ్రాఫర్‌లకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



స్లాబ్ పైపెచ్చు ఊడిపడిన దృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని జిల్లాపరిషత్ పాఠశాలలోని గదిలో స్లాబ్ పైపెచ్చు ఊడి కింద పడిన సంఘటన శుక్రవారం జరిగింది. పాఠశాలలోని రికార్డు అసిస్టెంట్ గదిలో పెద్ద శబ్ధం రావడంతో ఉపాధ్యాయులు గదిలోకి వెళ్లి చూడగా పైపెచ్చు పడివుంది. కాగా ఆ సమయంలో ఆగదిలో ఎవరు లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

శ్రీరామకథ సత్సంగం



మూసాపేట: మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులోని సంకట మోచన హనుమాన్ మందిరం ఆలయంలో శ్రీరామకథ, దివ్య దర్బార్‌ను శుక్రవారం నిర్వహించారు. అయోధ్య నుంచి వచ్చిన శ్రీధాం అయోధ్య శ్రీరామ్ లలా సర్కార్‌చే సత్సంగం నిర్వహించారు. శ్రీ రామకథ ఆదర్శనీయం అని అన్నారు. ఈ నెల 16వ తేదీ వరకు కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఐదు బస్సులు సీజ్

పటాన్‌చెరు టౌన్: విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ పేరిట రవాణశాఖ అధికారులు స్కూలు బస్సుల తనిఖీలు చేపట్టారు. మూడవరోజు శుక్రవారం బీరంగూడ నుండి కిష్టారెడ్డి పేట వైపు వెళ్లే దారిలో పలు స్కూళ్ల బస్సులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎంవీఐ విజయరావు మాట్లాడుతూ విద్యాసంస్థలకు చెందిన ఐదు బస్సులకు ఫిట్‌నెస్ సరిగా లేని కారణంగా సీజ్ చేసినట్లు తెలిపారు.

పుస్తకాల కిట్లు అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని మాదారం గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పుస్తకాల కిట్లు శుక్రవారం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, హెచ్‌ఎం అంజయ్యలతో పాటు ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఐఎస్ఐ' ఫలితాల్లో గురుకుల విద్యార్థి ప్రతిభ

ఆలిండియా ర్యాంకు 137 ..హైదరాబాద్ రీజియన్‌లో మొదటి ర్యాంకు



రాయదుర్గం: ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐఎస్ఐ) ప్రకటించిన ఫలితాలలో గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థి ప్రతిభ చాటాడు. కళాశాలకు చెందిన విద్యార్థి జాడీ రేవంత్ ఆలిండియా ర్యాంకు 137, కేటగిరి ర్యాంకు 4, హైదరాబాద్ రీజియన్‌లో మొదటి ర్యాంకును సాధించడం విశేషం శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ డి గణేష్ మాట్లాడుతూ ఐఎస్ఐ ప్రకటించిన ఫలితాలలో తమ విద్యార్థి రేవంత్ అత్యంత ప్రతిభ చాటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి రేవంత్‌ను, ప్రిన్సిపల్ గణేష్, అధ్యాపక బృందాన్ని గురుకుల కళాశాలల కార్యదర్శి సీతాలక్ష్మీ, హెచ్‌ఆర్‌ఆర్ వెస్ట్ ఆర్‌సీఓ డాక్టర్ శారదా వెంకటేష్, అదనపు కార్యదర్శి సక్రు నాయక్ అభినందించారు.

ఉత్తమ విద్యార్థులుగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలి

కొండాపూర్ కార్పొరేటర్ హమీద్ పటేల్

రాయదుర్గం: ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అని కొండాపూర్ కార్పొరేటర్ హమీద్‌పటేల్ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్‌లోని కొత్తగూడ ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పలక, బలపం, పెన్సిళ్ళు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, హెచ్‌ఎం నాగయ్య, మౌరి టెక్ ఫౌండేషన్ నిర్వాహకులు స్వర్ణరెడ్డి, సీనియర్ నాయకులు జంగంగౌడ్, లక్ష్మీనారాయణ, కేశంకుమార్, లక్ష్మణ్, ఖాసీమ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

తల్లిదండ్రులు చదువుకోమని మందలించడంతో బయటికి వెళ్లిన బాలిక



వసంత(ఫైల్)

మియాపూర్: తల్లిదండ్రులు చదువుకోమని మందలించడంతో ఇంటి నుంచి బయటికి వెళ్ళిన బాలిక అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. చెట్ల పొదల్లో శవమై కనిపించిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ దుర్గా రామలింగప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ నడిగడ్డతండా సమీపంలో చెట్ల పొదల్లో దుర్వాసన వస్తుందని బాలిక మృతి చెందిందని గురువారం రాత్రి స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు పరిశీలించి దుస్తులను చూసి వసంతగా గుర్తించారు. మహబూబాబాద్ జిల్లా మర్రిపెడ మండల్, లక్ష్మితండాకు చెందిన బాణోత్ నరేష్, శారద దంపతులకు కుమారుడు, కూతురు వసంత(13) ఉన్నారు. గత 20 రోజుల క్రితం స్వగ్రామం నుంచి నగరానికి వచ్చి మియాపూర్ నడిగడ్డ తండాలో ఉంటూ జెప్టోలో పనిచేస్తున్నాడు. వసంత 7వ తరగతి చదువుతుంది. ఈనెల 7వ తేదీన తల్లిదండ్రులు చదువుకోమని మందలించారు. పనుల నుంచి వచ్చిన తరువాత ఇంట్లో కనిపించక పోవడంతో చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గురువారం పోలీసులు వసంతగా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాపిరెడ్డినగర్ స్కూల్‌లో బడిబాట



అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న మదర్ సేవా సమితి అధ్యక్షులు కొండల్‌రెడ్డి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి పాపిరెడ్డినగర్ ప్రైమరీ స్కూల్‌లో బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బడిబాటలో భాగంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. మదర్ సేవా సమితి అధ్యక్షులు బద్దం కొండల్‌రెడ్డి చిన్నారులకు స్లేట్స్, బిస్కట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్‌నాయక్, కాలనీవాసులు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్కర బ్రహ్మోత్సవాలు





బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్, వివేకానందనగర్‌లోని శ్రీ భూనీల సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి పుష్కర బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం స్వామి, అమ్మవారికి మంగళ స్నానాలు నిర్వహించారు.శనివారం ఉ 9 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, అన్నదానం, సాయంత్రం 7గంటలకు స్వామివారి ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

'సన్నాల'కే సై



యెట్టిగడ్డసంగం గ్రామ శివారులో సాగుచేసిన సన్న రకం వరి (ఫైల్)

పెరగనున్న వరి సాగు

- రూ.500 బోనస్ ప్రభుత్వ ప్రకటనతో రైతుల్లో ఉత్సాహం
- గత యాసంగిలో 98,987 ఎకరాల్లో వరి
- ఈ వానాకాలంలో 1.41లక్షల ఎకరాల అంచనా

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆ పంటను సాగు చేయడానికి రైతులు ఉత్సాహం చూపుతున్నారు. వచ్చే వానాకాలం సీజన్ నుంచే ఈ పథకం అమలు చేయాలని సర్కార్ తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో సన్నరకం వరి సాగు గణనీయంగా పెరగనుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులతో పాటు హాస్టళ్లకు, మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయించింది. అయితే డిమాండ్‌కు తగ్గ సన్నబియ్యం అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్రంలోని రైతులను ప్రోత్సహిస్తూ సన్నాల సాగు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా సన్న రకాల వడ్లకు బోనస్ ఇస్తామని ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోనూ సన్నాల వరి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది.

పెరగనున్న సాగు విస్తీర్ణం

గత యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 98,987ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. ఈ వానాకాలంలో 1.41లక్షల ఎకరాల్లో సాగు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అయితే బోనస్ ప్రకటనతో ఈ సారి లక్ష్యానికి మించి దాదాపు రెండు లక్షల ఎకరాల్లో వరి పంట సాగయ్యే పరిస్థితి కనిపిస్తుంది. సాధారణంగా దొడ్డు రకాలతో పోలిస్తే వరి సన్నాలకు దిగుబడులు తక్కువే. దొడ్డు రకాలు ఎకరానికి సగటున 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. అదే సన్న రకాలైతే ఎకరానికి 15నుంచి 20బస్తాల దిగుబడి మాత్రమే ఉంటుంది. దొడ్డు రకాలతో పోలిస్తే సన్నాల సాగు సమయంతో పాటు చీడపీడలు బెడద కూడా ఎక్కువే.

డిమాండ్ ఎక్కువే..

ధర విషయానికి వచ్చేసరికి సన్నాలకు విపరీతంగా డిమాండ్ ఉంటుంది. దొడ్డు రకానితో పోలిస్తే సన్నాల ధాన్యం క్వింటాల్‌కు దాదాపు రూ.600 అధిక ధర లభిస్తుంది. గత యాసంగిలో సన్నాలు సాగు చేసిన రైతులంతా తమ పొలాల వద్దే పంటను అధిక ధరకు అమ్ముకున్నారు. దొడ్డు రకాలు క్వింటాల్‌కు రూ.1,850కు కొనుగోలు చేయగా, సన్నాలు మార్కెట్‌లో రూ.2,400కు పైగా ధర పలికింది. మార్కెట్‌కు తీసుకు వెళ్లకుండానే పొలాల వద్దే ప్రైవేటు వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి అవసరమైన సన్న బియ్యం మార్కెట్‌లో దొరకడం లేదు. ఈ కారణంగా ప్రభుత్వం సన్న రకాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది. అయితే దొడ్డు వడ్లకు కూడా రూ.500 బోనస్ వర్తింపజేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రైతు ప్రభుత్వం



కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోంది. సన్నాలు సాగు చేసే రైతులను ప్రోత్సహిస్తూ రూ 500బోనస్ ప్రకటించింది. సన్నాల పంట విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.
– కుమార్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, సదాశివపేట

దొడ్డు వడ్లకూ ఇవ్వాలి



రాష్ట్ర ప్రభుత్వం కేవలం సన్నవడ్లకు మాత్రమే రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పడం సరికాదు. దొడ్డు వడ్లకూ ఇవ్వాలి. నీటి వనరులు తక్కువగా ఉండడంతో జిల్లాలో సన్నరకం వడ్లు అందరూ సాగు చేయడానికి అవకాశం ఉండదు.
-పట్లోళ్ల మల్లేశం, మాజీ రైతుబంధు సమితి అధ్యక్షుడు, కొండాపూర్

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

రాయదుర్గం: ఐపీఎల్ బెట్టింగ్‌కు యువకుడు బలైన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా రేగోడ్ మండలం తట్‌పల్లికి చెందిన కంకరి నగేష్(21) ప్రైవేట్ ఉద్యోగి. గురువారం ఖాజాగూడలోని బాలాజీ లగ్జరీ ఓయోలో గది అద్దెకు తీసుకున్నాడు. శుక్రవారం ఉదయం 11 గంటలకు గది ఖాళీ చేయాల్సి ఉన్నా అతను రాకపోవడంతో రిసెప్షన్‌లో ఉండే గోవింద్ తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడి అప్పుల పాలైనట్లు పోలీసులు తెలిపారు.గత మూడు నెలలుగా ఇంటికి డబ్బులు కూడా పంపడం లేదని తెలిసిందని వారు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

కొద్ది క్షణాల్లో ఉద్యోగంలో చేరబోతూ..

రాంగ్‌రూట్లో వెళ్లి బైక్‌ను ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం



మనోజ్‌కుమార్ (ఫైల్)

రాయదుర్గం: కొద్ది క్షణాల్లో ఉద్యోగంలో చేరేలోపే విషాదం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా మారుమూల గ్రామానికి చెందిన వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరడానికి బైక్‌పై బయలు దేరి మార్గమధ్యంలో రాంగ్ రూట్‌లో వెళ్ళి మరో బైక్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందిన విషాదకరమైన ఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలోని గునపాలెమ్‌కు చెందిన పురుషోత్తంరాజు, తల్లి నాగమ్మ ఇద్దరు డఫ్ అండ్ డమ్ . స్థానికంగా ప్రభుత్వ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. వీరి కుమారుడు బలగ మనోజ్‌కుమార్(23) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో కొత్తగూడలోని నీలమ్ మెన్స్ హాస్టల్‌లో నివాసముంటూ సోమవారం ఉదయం ఉద్యోగంలో చేరడానికి బైక్‌పై బయలు దేరాడు. కొత్తగూడ కూడలి వద్ద అజాగ్రత్తగా, అతివేగంగా హెల్మెట్ లేకుండా వచ్చి సిగ్నల్ వద్ద మరో బైక్‌పై వేచి ఉన్న సాయి అనే విద్యార్థిని ఢీ కొట్టాడు. మనోజ్‌కుమార్ కింద పడి హెల్మెట్ లేకపోవడంతో తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా గాయాలపాలైన సాయిని అంబులెన్స్‌లో కొండాపూర్‌లోని ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని రాయసముద్రం చెరువు చుట్టూ ఉన్న వాకింగ్‌ట్రాక్‌ను మరింత అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ పుష్పనగేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని రాయసముద్రం చెరువును జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ సురేష్‌తో కలసి ఆమె సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువు చుట్టూ ఉన్న వాకింగ్‌ట్రాక్ పక్క చెత్త వేస్తున్నారని దీంతో వాకింగ్‌కు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారని ,చెత్తను తొలగించి శుభ్రం చేయించామన్నారు. ఇక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం శ్రీనివాస్‌నగర్ కాలనీలో పర్యటించారు.

వివాహిత దారుణ హత్య



హఫీజ్‌పేట్: చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత దారుణ హత్యకు గురైంది. కర్ణాటకకు చెందిన అమర్‌సింగ్, విజయలక్ష్మి (40) దంపతులు లింగంపల్లిలోని ఎంఐజీలో నివాసముంటున్నారు. అమర్‌సింగ్, కూలీ పనిచేస్తుండగా, విజయలక్ష్మి అపర్ణ సరోవర్‌లో వంట పని చేస్తోంది. ఇదిలా ఉండగా విజయలక్ష్మి తమ్ముడు సునీల్ ఆటో ఫైనాన్షియర్ భరత్ గౌడ్ అలియాస్ శ్రీనివాస్‌గౌడ్ (42) వద్ద ఫైనాన్స్ తీసుకొని ఆటో కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో ఫైనాన్స్ కట్టడం లేదని భరత్ గౌడ్ సోదరులు ఆటో లాక్కొని వెళ్ళారు. ఇటీవల లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం మధ్యాహ్నం 12.20 గంటలకు అమర్‌సింగ్ ఇంటికి భరత్ గౌడ్ వచ్చాడు. విజయలక్ష్మి డోర్ తీయగా చిన్న కుమారుడు కార్తీక్ చూస్తుండగా భరత్‌గౌడ్ ఆమె గొంతులో కత్తితో రెండుసార్లు పొడిచాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.